క్లుప్తంగా

ఆక్రమణలు తొలగిస్తాం..

మణుగూరుటౌన్: వావాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రెయిన్లను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, తాత్కాలిక నిర్మాణాలు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారుల సంయుక్తంగా తొలిగించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గురువారం తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో వర్తక సంఘం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశామని, ఆ సమయంలో వ్యాపారులు స్వచ్ఛందంగా ఆక్రమించిన స్థలాల్లో నిర్మించిన నిర్మాణాలను తొలిగించుకోవాలని సూచించామన్నారు. వానకాలం వచ్చే వరదను ఉంచుకోవడంతో పాటు రోడ్లపై నీరు నిలవకుండా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రెండు రోజుల్లో ప్రధానరోడ్డుకి ఇరువైపులా డ్రైన్లపై ఆక్రమించి కట్టుకున్న నిర్మాణాలు తొలగించనున్నట్లు తెలిపారు.

చార్జీల పెంపుపై నిరసన

భద్రాచలంఅర్బన్: ప్రభుత్వం పెంచిన బస్సు పాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని భద్రాచలం సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం భద్రాచలం బస్టాండ్ ఆవరణలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎంబీ నర్సారెడ్డిలు మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు పాసులపై 20% నుంచి 50% వరకు పెంచడం వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతుందని అన్నారు. పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నకిరికంటి నాగరాజు, సంద్ర భూపేంద్ర, కుంజా శ్రీనివాస్, ఎస్.అజయ్ కుమార్, కోరాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో జ్వర సర్వే

మణుగూరురూరల్: పగిడేరు గ్రామపంచాయతీ ఎస్టీకాలనీలో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం జ్వర సర్వే నిర్వహించారు. వైద్యసిబ్బంది గ్రామంలోని ఇంటింటినీ సందర్శించి జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమూనాలను సేకరించారు. మందులను అందించారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు డాక్టర్ నిశాంత్‌రావు వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. సాంబాయిగూడెం గ్రామంలో ఆయుష్మాన్ మందిర్‌ను డాక్టర్ నిశాంత్‌రావు సందర్శించి రికార్డులను పరిశీలించారు. రాంప్రసాద్, కృష్ణ సుజాత, కౌసల్య, కనకదుర్గ, రజిని పాల్గొన్నారు.

దోమల మందు పిచికారీ

అన్నపురెడ్డిపల్లి(చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న విద్యార్థుల వసతీ గృహాల్లో గురువారం దోమల మందు పిచకారి చేశారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ, కస్తూర్బాగాంధీ పాఠశాల, ఎంజేపీ డిగ్రీ కళాశాల, ఎస్టీ, బీసీ వసతీగృహాల్లో దోమల మందు పిచకారీ చేశారు. ఏఎంఒ కుమారస్వామి, డాక్టర్ ప్రియాంక, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్‌రావు, హెల్త్ అసిసెంట్ రామదాసు, కోటేశ్వరరావు పర్యవేక్షించారు.

పినపాక: మండల పరిధిలోని ఐలాపురం ఆశ్రమ పాఠశాలతో పాటు పలు పాఠశాలల్లో వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సహకారంతో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పలు గ్రామాల్లో సిబ్బంది పిచికారీ చేశారన్నారు. పినపాక పీహెచ్‌సీ వైద్యాధికారిని దుర్గా భవాని, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథ అనుబంధ ప్రగతిశీల ఐక్య రైతు సంఘం, ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పార్టీ మండల కార్యదర్శి సాయన్న మాట్లాడుతూ.. ఖరీఫ్ సాగు రైతాంగ సమస్యలు పరిష్కరించండి అంటూ జూన్ 9 నుంచి 16వ తేదీ వరకు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. శ్రీరాములు, సోయం శంకర్, రమేష్, నాగమణి, లక్ష్మి పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

మణుగూరురూరల్: ఈ నెల 14వ తేదీన కొత్తగూడెంలో జరిగే మాలల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పూల రవీందర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మణుగూరు కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం మహాజాతర కరపత్రాలను ఆవిష్కరించారు. పలు ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి పాల్‌రాజ్, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ దాముల్ల సత్యం, పినపాక నియోజకవర్గ గౌరవ సలహాదారు మందాడి సంజీవ్, పినపాక నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మల కిరణ్, పట్టణ అధ్యక్షుడు భవాని శంకర్, మండల అధ్యక్షుడు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు సహకారం

దమ్మపేట: నిరుపేద కుటుంబానికి చెందిన గోపాలపురం గ్రామవాసి రాజిని పోలమ్మ అనారోగ్యంతో చనిపోగా.. మృతదేహానికి అంత్యక్రియలను గౌతం బుద్ధ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. తమ సొంత ఖర్చులతో ఖననం చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రొయ్యల కుమార్, పాలడుగుల అబ్బులు, అజీమ్, పాషా పాల్గొన్నారు.

ఆహ్లాదంగా 'పల్లె ప్రకృతి'

- భద్రగిరి వాసులను ఆకట్టుకుంటున్న వనాలు
- వాకింగ్‌తో పాటు సేద దీరేందుకు ఆసక్తి
- నిత్యం ఫొటోషూట్ల సందడి



వాకింగ్ చేసేందుకు ఏర్పాటు చేసిన ట్రాక్



ఆడుకుంటున్న చిన్నారులు

భద్రాచలంటౌన్: పట్టణాల్లో పల్లెల వాతావరణాన్ని కల్పించేందుకు గత ప్రభుత్వం పల్లెప్రకృతి వనాల పేరుతో మినీ పార్కులను ఏర్పాటు చేసింది. వీటిని మారుమూల పల్లెల్లో సైతం సుందరంగా తీర్చిదిద్దారు. అయితే పల్లెటూర్లల్లో వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో కనుమరుగు కాగా.. పట్టణాల్లో పల్లె ప్రకృతి వనాలు ప్రజలకు ఆకట్టుకుంటున్నాయి. పచ్చటి వాతావరణంతో పాటు కుర్చొవడానికి బల్లలు, పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు ఉండడంతో ఉదయం, సాయంత్రం పల్లెపకృతి వనాలు జనాలతో సందడి వాతావరణం కనిపిస్తోంది.

భద్రాచలం పట్టణంలో ఇందిరా కూరగాయ మార్కెట్‌తో పాటు, ఎంపీడీఓ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. రెండు చోట్లా ప్రశాంత వాతావరణం ఉండడంతో పాటు నిర్వహణ మెరుగ్గా ఉండడంతో ప్రజలు వాకింగ్ చేయడంతో పాటు పచ్చని చెట్ల మధ్య స్వచ్ఛమైన గాలి తీసుకుంటూ సేద తీరేందుకు వస్తున్నారు.

పిల్లల నుంచి పెద్దల వరకు..

పల్లెప్రకృతి వనాల్లో చెట్ల మధ్య స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటూ వాకింక్ చేసేందుకు పట్టణ వాసులు క్యూ కడుతున్నారు. పచ్చని చెట్ల మధ్య ఆహ్లాదం వాతావరణంలో వాకింగ్ చేయడంతో ఉల్లాసంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. పిల్లలు సైతం ప్రతి రోజూ పల్లెప్రకృతి వనాలకు చేరుకుని ఆటలు ఆడుకోవడంతో ఆసక్తి చూపుతున్నారు. పిల్లలు ఆడుకునేందుకు ఇక్కడ ప్రత్యేక ఏర్పాట్లు సైతం చేయడంతో ఆనందంగా గడుపుతున్నారు. సిబ్బంది సైతం తగిన పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నారు.

ఫొటో షూట్లకు కేరాఫ్‌గా..

పచ్చని చెట్లు, అడవులను తలపించే విధంగా వాతావరణం ఉండడంతో వివిధ శుభాకార్యాలకు సంబంధించిన ఫొటో షూట్లు చేసేందుకు ఫొటోగ్రాఫర్లు సైతం ఈ ప్రకృతి వనాలను ఎంచుకుంటున్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి అధిక మొత్తం డబ్బులు ఖర్చు చేయలేని వారికి పల్లెప్రకృతి వనాలు ఒక వరంలా మారాయి. తక్కువ ఖర్చుతో ఉచితంగా మంచి లొకేషన్లు ఉండడంతో పెళ్లిళ్లు, ఫంక్షన్‌లకు ముందు, తరువాత ఫోటోస్ దిగేందుకు ప్రతి రోజు పల్లెపకృతి వనానికి ప్రజలు వస్తున్నారు.

బాత్‌రూమ్‌లు శుభ్రం చేయించాలి

పల్లెప్రకృతి వనంలో పిల్లలు, పెద్దలు సేదతీరేందుకు చాలా బాగుంది. పెద్ద చెట్లు ఆటవీ వాతారణాన్ని మరపిస్తున్నాయి. పిల్లలు సైతం ఆడుకునేందుకు ఏర్పాట్లు చాలా బాగా చేశారు. కానీ బాత్రూమ్స్ నిర్వాహన సరిగా లేదు. అధికారులు శుభ్రం చేయించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, భద్రాచలం

మూడేళ్లుగా వస్తున్నాం...

పల్లెప్రకృతి వనం ప్రారంభించిన నాటి నుంచి ప్రతి రోజూ వస్తున్నా. ఉదయం నేను నా భార్య గంట పాటు వాకింగ్ చేసి వెళ్తాం. ఇక్కడ వాతావరణం చాలా ప్రశాంతంగా ఉంటుంది. పచ్చని చెట్ల మధ్య ఉదయం వాకింగ్ చేయడం ఆరోగ్యానికి మంచిదని వైద్యులు సూచించారు.

– మంగీలాల్, భద్రాచలం

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ స్వర్ణజ్యోతి

మణుగూరురూరల్: బాల కార్మిక వ్యవస్థను అంతమొందించేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మణుగూరు ఎంఈఓ స్వర్ణజ్యోతి పిలుపునిచ్చారు. మున్సిపాలిటి పరిధిలోని గాంధీనగర్‌లో గల జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్(ఎయిడ్) సంస్థ ఆధ్వర్యంలో బాలకార్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ స్వర్ణజ్యోతి హాజరై మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలు పాఠశాలల్లో ఉండాలే కానీ బాల కార్మికులుగా మారకూడదన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపకుడా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలన్నారు. ప్రభుత్వమే పిల్లలకు ఉచితంగా పుస్తకాలు, దుస్తులు, భోజనం అందిస్తుంధదని తెలిపారు. ఎయిడ్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సంస్థలను ఆమె అభినందించారు. అనంతరం సంస్థ డైరెక్టర్ హరిప్రసాద్, ట్రైనీ ఎస్సై మనీషా, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ గౌరిప్రసాద్, లేబర్ ఆఫీసర్ నాగరాజులు మాట్లాడారు. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి కానీ, పోలీస్ స్టేషన్‌లో కానీ సమాచారం ఇవ్వాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ ఆర్గనైజర్ నాగుల జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయినీలు ధనలక్ష్మి, కలైనాదేవి, పద్మ, ఎయిడ్ సంస్థ సభ్యులు కుటుంబరావు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.


పామాయిల్ మొక్కలు పంపిణీ

అశ్వాపురం: మండల కేంద్రంలో ఆయిల్‌ఫెడ్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం రైతులకు 80 శాతం సబ్సిడీపై పామాయిల్ మొక్కలు పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయిల్‌ఫెడ్ అధికారులు మాట్లాడుతూ.. మండలంలో సుమారు 400 ఎకరాలు పామాయిల్ సాగు అవుతుండగా విస్తీర్ణం పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ఆయిల్ పాం సాగుపై ఎకరానికి రూ.4200 ప్రోత్సాహకం ఇవ్వడంతోపాటు డ్రిప్ ఇరిగేషన్‌కు కూడా సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ అధికారులు వికాస్, ప్రవీణ్, రైతులు ఓరుగంటి భిక్షమయ్య, గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, ఈదర అప్పారావు, కందుల ప్రసాద రావు, ముప్పారపు సత్యనారాయణ, రాయల కృష్ణ, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ మొక్కలు నాటుతున్న అధికారులు, రైతులు

సీపీఐ మండల కార్యదర్శిగా యూసఫ్



ములకలపల్లి: సీపీఐ మండల కార్యదర్శి పీఠం మరోమారు యూసఫ్‌కే దక్కింది. ములకలపల్లిలో నిర్వహించిన మండల మహాసభలో నూతన కమిటీని ప్రకటించారు. మండల కార్యదర్శిగా మహమ్మద్ యూసఫ్, సహాయ కార్యదర్శిగా నరాటి రమేశ్ రెండోసారి ఎంపికయ్యారు. 63 మంది కౌన్సిల్ సభ్యులుగాను, 29 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూసఫ్, రమేశ్‌లు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని అన్నారు.

క్షయవ్యాధి వైద్యశిబిరం



గ్రామస్తులతో మాట్లాడుతున్న డాక్టర్ రుక్మాకర్ రెడ్డి

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో టీబీ ముక్త్ భారత్ క్యాంపెన్‌లో భాగంగా చర్ల-టీయూ, పీహెచ్‌సీ-దుమ్ముగూడెం, సెక్యూర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంపులో క్షయ వ్యాధి అనుమానితులైన 33 మందికి పరీక్ష చేసి వారి నుంచి 22 తెమడ శ్యాంపిళ్ల సేకరించారు.అలాగే షుగర్, బీపీ, కామెర్లు, హెచ్ఐవీ పరీక్షలు సైతం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు ఉన్నవారు దగ్గరలోని ఆస్పత్రులకు వెళ్లి తెమడ పరీక్ష, ఎక్స్‌రే పరీక్ష చేయించుకోవాలని, నిర్ధారణ అయితే ఆరు నెలలు క్రమం తప్పకుండా మందులు వాడాలని సూచించారు. ఈ క్యాంప్‌లో ఎస్‌టీఎస్ యం.రాజు, టీబీ నోడల్ పర్సన్ సాగర్, వైద్య సిబ్బంది గంగాధర్, ధర్మారావు, నరసింహారావు,చలపతి, ఏఎన్ఎం దుర్గాదేవి, కవిత, టీబీ అలెర్ట్ ఇండియా ఎన్‌జీఓ వెంకటేశ్వర రావు, ఆశా వర్కర్‌లు, సెక్యూర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

మణుగూరురూరల్: సమితిసింగారం గ్రామపంచాయతీ సాయినగర్‌లోని శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేయగా.. భక్తులు మామిళ్ల పిచ్చయ్య గౌడ్-శోభాదేవి దంపతులు, వారి కుమార్తెలు అర్చన, రచనలు అన్నదానం చేశారు. రచన పుట్టినరోజు సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అన్నదాతలను ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని నన్నపనేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు గురువారం నగదు ప్రోత్సహకాలను అందజేశారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఆచంటి సీతారాములు టెన్త్‌లో పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచి ఇద్దరు విద్యార్థులకు ఒక్కొరికి రూ.5 వేల చొప్పున ప్రోత్సహక నగదుతో పాటు నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరాజు, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలో విద్యార్థులకు ఆహ్వానం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో 2025–26 ఏడాదికి ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలి ఉన్న సీట్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాంతీయ సమన్వయ అధికారిణి బి.అరుణకుమారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 16వ తేదీన భద్రాచలంలోని గిరిజన సంక్షేమ పాఠశాల వద్ద జరిగే స్పాట్ కౌన్సిలింగ్‌కు హాజరు కావాల్సిందిగా ఆమె కోరారు.

క్రీడా పాఠశాలలకు ఎంపిక

దుమ్ముగూడెం: క్రీడా పాఠశాలలో 2025–26 సంవత్సరానికి సంబంధించి 4వ తరగతిలో చేరేందుకు మండలంలో 3వ తరగతి పాసైన వారికి ఈ నెల 16,17 తేదీల్లో ములకపాడు క్రీడా ప్రాంగణంలో ఎంపిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ సున్నం సమ్మయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడా పాఠశాలలో చేరుటకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. బాలురకు 16వ తేదీన, బాలికలకు 17వ తేదీన ఎంపికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు 01 సెప్టెంబర్, 2016 నుంచి 31 ఆగస్టు, 2017 మధ్యన పుట్టినవారై ఉండాలని (8 నుంచి 9 సంవత్సరాలు) ముందస్తుగా ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని వెల్లడించారు. మరింత సమాచారం కోసం 8897529774ను సంప్రదించాలన్నారు.

రేపు లోక్‌అదాలత్

అశ్వాపురం: మణుగూరు కోర్టులో ఈ నెల 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీఐ అశోక్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాజీ పడదగిన కేసులు ఉంటే రాజీ పడవచ్చన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఉన్న వారు తక్కువ జరిమానా ఉన్నందున కోర్టుకు వచ్చి చెల్లించుకోవచ్చని సీఐ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు ఫార్మర్ రిజిస్ట్రీ

చంద్రుగొండ: నేడు తిప్పనపల్లిలో రైతు రిజిస్ట్రీ ప్రక్రియ చేపట్టనున్నట్లు ఏఈఓ అరుణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పీఎం కిసాన్, కేంద్ర ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఈ రిజిస్ట్రీ విధిగా చేయించుకోవాలని రైతులకు ఆమె సూచించారు. ఆధార్‌కార్డ్‌తోపాటు బ్యాంకు ఎకౌంట్‌కు లింక్ అయి ఉన్న ఫోన్ నంబర్ పట్టా పాసు పుస్తకం తీసుకు రావాలని రైతులకు తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

అశ్వారావుపేటరూరల్: రెవెన్యూ సదస్సుల్లో వచ్చే భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని తిరుమలకుంట, గాండ్లగూడెం గ్రామ పంచాయతీల్లో సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతుల వద్ద నుంచి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ రెండు సదస్సుల్లో రైతుల వద్ద నుంచి 429 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్, ఆర్ఐలు కృష్ణ, పద్మావతి, సిబ్బంది రమేష్, చైతన్య, వెంకన్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇల్లు ప్రారంభం



మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక: మండల పరిధిలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. నాణ్యతలో ఎటువంటి లోటు లేకుండా ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందిస్తామన్నారు. అనంతరం భూపాలపట్నం పంచాయతీలో ఇందిరమ్మ ఇంటికి శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్కరికి కూడా ఇల్లు అందజేయలేదన్నారు. రానున్న రోజుల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పరిశీలించి అర్హులైన వారికి అందజేస్తామన్నారు. అనంతరం ఉప్పాక పంచాయతీలో అంగన్వాడి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటన



దమ్మపేట: స్వయం సహాయక సంఘాలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన బడిబాట కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే జారె ఆదినారాయణ గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలకు మంజూరైన బ్యూటిషన్ కోర్స్ గదిని ప్రారంభించారు. విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తువులు పంపిణీ చేశారు. స్థానిక ఐసీడీఏ కార్యాలయంలో జరిగిన బాలల హక్కుల సమావేశానికి హాజరై, అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే స్థానిక బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలకు డ్రైయినేజీ నిర్మాణానికి సహకరించాలని స్థానికులను కోరారు. ముందుగా మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు చందా సతీష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆ తర్వాత గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి, సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, హెచ్ఎం హరిత, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేష్, మండల నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, నండ్రు రమేష్, మిండా హరిబాబు, నార్లపాటి దివాకర్, పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల పరిశీలన

దమ్మపేట: అఖినేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రెవెన్యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామసభకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ హాజరై, సభ జరుగుతున్న తీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ సభలో అందజేసిన ప్రతి దరఖాస్తును కులంకషంగా పరిశీలించి, అర్హత గల ప్రతి ఒక్కరికీ భూ హక్కు పత్రాలు అందజేస్తామని తెలిపారు. పట్వారిగూడెం గ్రామంలో రూ.కోటి 13 లక్షల విలువ గల చెక్కును ఎమ్మెల్యే చేతుమీదుగా మహిళ స్వయం సహాయక సంఘాలకు అందజేశారు. చిన్నగొల్లగూడెం గ్రామంలో గిరిజనుల అచారమైన వలసల పండుగ వేడుకలకు ఎమ్మెల్యే హాజరై, వారి అతిథ్యాన్ని స్వీకరించారు. బొల్లిగట్టు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ భగవాన్ రెడ్డి, అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం

మణుగూరురూరల్: పేద ప్రజలకు అండగా సీపీఐ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య అన్నారు. గురువారం మండలంలోని విజయనగరం, బెస్తగూడెం, గొల్లకొత్తూరు గ్రామాల్లో జరిగిన పార్టీ గ్రామ శాఖ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో వంద సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 26వ తేదీన కిన్నెర కల్యాణ మండపంలో జరిగే పార్టీ మండల, పట్టణ మహాసభలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన గ్రామశాఖ కమిటీలను ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మాజీ సర్పంచ్ పాయం కామరాజు, నాయకులు పులిగిల్ల రమేష్, ఎం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సమాచారం

తిరిగి పాఠశాలలకు విద్యార్థులు



భట్టుపల్లిలో విద్యార్థులకు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలుకుతున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

కరకగూడెం: సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం మండలంలో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు సరికొత్త ఉత్సాహంతో పాఠశాలలకు చేరుకున్నారు. విద్యా సంవత్సరం తొలి రోజు కావడంతో చాలా పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొంది.ఈ మేరకు భట్టుపల్లి జెడ్పీ పాఠశాలలో విద్యార్థులను పాఠశాల హెచ్ఎం మోహన బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. కొత్త పుస్తకాలు, యూనిఫామ్‌లను విద్యార్థులకు అందజేశారు.

సరస్వతి దేవికి పూజలు..

మణుగూరుటౌన్: వేసవి సెలవుల అనంతరం తిరిగి పాఠశాలలు గురువారం పునఃప్రారంభం అవడంతో విద్యార్థులు పాఠశాలలకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని జెడ్పీ కో-ఎడ్యుకేషన్ హైస్కూల్ హెచ్ఎం నాగశ్రీ సరస్వతి దేవికి పూజలు చేసి విద్యార్థులకు స్వాగతం పలికారు. విద్యార్థులతో పూజలు జరిపించి విద్యాబుద్ధులు అబ్బాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన పుస్తకాలు, ఏకరూపదుస్తులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

దమ్మపేట: నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం బజ్జూరి సరళ ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులు, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. 2024–25 పది ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినందున, హెచ్ఎం, ఉపాధ్యాయులను అదే పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి పదవి విరమణ చేసిన ప్రభుదాసు చేతులమీదుగా గ్రామ పెద్దల సమక్షంలో సత్కరించారు. పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చేతులమీదుగా పంపిణీ చేశారు. ఎంఈఓ కీసర లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగులు, నోట్ పుస్తకాల వితరణ

దుమ్ముగూడెం: మండలంలోని జడ్ వీరభద్రారం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు, నోట్ పుస్తకాలను ఎంపీడీఓ ఆఫీస్ టైపిస్ట్ సాయిబాబు గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా పాఠశాలలోని 30 మంది విద్యార్థులకు సొంత ఖర్చుతో వాటిని అందజేశారు. సాయిబాబును ఎంఈఓ సమ్మయ్య శాలువాతో సన్మానించారు. ఎజె.ప్రభాకర్, రామకృష్ణ, ముద్దరాజ్ తదితరులు పాల్గొన్నారు.


బడిబాట కార్యక్రమం

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో శివారు తండాలోని గిరిజన ప్రాథమిక సంక్షేమ పాఠశాల ఆధ్వర్యంలో గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. గిరిజన సంక్షేమశాఖ ఏటీడీఓ చంద్ర మోహన్ చేతులమీదుగా పిల్లలకు యూనిఫాం దుస్తులు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఇస్లావత్ వీరన్ననాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మ మాట– అంగన్‌వాడీ బాట

ములకలపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జగన్నాథపురం క్లస్టర్ పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో గురువారం 'అమ్మమాట–అంగన్‌వాడీ బాట'కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రీస్కూల్ చిన్నారులతో పురవీధుల్లో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ .. అంగన్‌వాడీ కేంద్రాలో అందిస్తున్న సేవలను వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు సత్యావతి, రాజేశ్వరి, బాలామణి, వాణి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి..



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్

మణుగూరుటౌన్: పాఠశాలను ప్రగతిపథంలో నడిపిస్తూ.. నాణ్యమైన విద్యనందిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని జీఎం(ఎడ్యుకేషన్) గుండా శ్రీనివాస్ అన్నారు. గురువారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన.. పాఠశాల పునఃప్రారంభాన్ని ఉద్దేశించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. సింగరేణి స్కూళ్లలో ఇంటిగ్రేటెడ్ పాలిసెట్ ఓలంపియాడ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం హెచ్ఎం కల్యాణిని ప్రశంసాపత్రంతో పాటు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఇన్‌చార్జ్ హెచ్ఎం.పూల్ సింగ్, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు వేణు, కృష్ణబాబు, మస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశం

భద్రాచలంటౌన్: పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్య బుద్ధులు నేర్పించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ నారాయణ అన్నారు. పట్టణంలోని జగదీష్ కాలనీ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం బడిబాటలో భాగంగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీడీఓ నారాయణ, ఎంఈఓ రమతో కలిసి విద్యార్థులకు నోట్ పుస్తకములు, పాఠ్యపుస్తకములతో పాటు యూనిఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు రాజా శ్రీనివాస్, రాజ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.